క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: నగరంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండ సుబేదారి మెయిన్ రోడ్డు, పోస్టల్‌కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు వరంగల్‌లోని మామునూరు, కుమ్మరిపల్లి, డైరీ ఫాం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనలో వివరించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి సంస్కృతీ విహార్‌లోని గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకులు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ మేనేజర్ మాధురి తెలిపారు. మగ్గం వర్క్స్, ఉమెన్ టైలరింగ్‌లో 30 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు, రేషన్ కార్డులు కలిగి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని మేనేజర్ మాధురి వివరించారు.

హరిబాబుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ విభాగంలో పరిశోధకుడు ఆరెపెల్లి హరిబాబుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పాపులర్ కల్ట్స్ అండ్ రిలీఫ్ సిస్టమ్స్ అండర్ కాకతీయాస్ ఆఫ్ వరంగల్ 1000 ఏడీ టూ 1323 ఏడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి హరిబాబుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ విజయ్‌బాబు పర్యవేక్షణలో హరిబాబు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

9న ‘ కత్తి కాంతారావు’ ప్రదర్శన

హన్మకొండ చౌరస్తా: అలనాటి సినీ కథానాయకుడు టీఎల్.కాంతారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 9వ తేదీన హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో కత్తి కాంతారావు నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు సురభి సంస్థ కార్యదర్శి సంతోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీసాయి సంతోషి నాట్య మండలి (సురభి) ఆధ్వర్యంలో నాటక రచన, దర్శకుడు జగదీష్ నేతృత్వంతో 9న సాయంత్రం 6గంటలకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కళాభిమానుల పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణకు నేడు చివరి గడువు

నయీంనగర్: వరంగల్ నగర పరిధిలోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి అందించాల్సిన నివేశన స్థలాల కోసం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఉదయం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సిక్స్ మెన్ కమిటీ కన్వీనర్ బీఆర్.లెనిన్, కో కన్వీనర్ వేముల నాగరాజు ప్రారంభించారు. ఏకశిల, కాకతీయ హౌసింగ్ సొసైటీల్లో సభ్యులుగా లేని 5 ఏళ్లకుపైగా నగర పరిధిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు తమ దరఖాస్తులను గురువారం సాయంత్రం 5గంటల లోపు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో అందజేయాలని సిక్స్ మెన్ కమిటీ కోరింది. సమయం లేనందున త్వరగా దరఖాస్తులు స్వీకరణ, స్క్రూటినీ, తుది జాబితా, ప్రభుత్వానికి అర్హుల జాబితా అందించి జర్నలిస్టులకు స్థలాలు సాధించడం కమిటీ కర్తవ్యం అని సభ్యులు పేర్కొన్నారు. గడువు పొడిగించడం ఉండదని స్పష్టం చేశారు. దరఖాస్తుల కార్యక్రమాన్ని కో కన్వీనర్ బి.దయాసాగర్, సభ్యులు బొల్లారపు సదయ్య పర్యవేక్షించారు. కాగా, బుధవారం 140 దరఖాస్తులు అందాయని చెప్పారు.

వీధికుక్కల పట్టివేత

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దాంతో బయటికి వెళ్లేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారిని కూడా వదలడం లేదు. ఈక్రమంలో కుక్కల బెడదను అరికట్టాలని కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామికి స్థానికులు విజ్ఞప్తి చేశారు. మహానగర పాలక సంస్థ సంస్థ వీధికుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతానికి తరలించారు.

మహిళపై కుక్కల దాడి

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో బుధవారం రాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న లక్ష్మి అనే మహిళపై వీధి కుక్కలు దాడి చేసి ఆమె చిటికెన వేలు కొరికి వేశాయి. స్థానికులు వెంటనే గమనించి కుక్కలను తరిమి వేయడంతో ప్రమాదం నుంచి లక్ష్మి బయట పడింది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



విద్యారణ్యపురి: హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



ఎంఈఓ రాంకిషన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



హన్మకొండ అర్బన్ ధర్నాలో పాల్గొన్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని డీఈఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రణీత్, వేల్పుల చరణ్‌యాదవ్, జిల్లా సమితి సభ్యులు కుశాల్, సురేష్, అనిల్, ప్రశాంత్, కుమార్, శివ, పవన్, పీడీఎస్‌యూ నాయకులు రంజిత్, మహేష్, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ కార్యాలయంలో అధికారులకు అందజేశారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

హనుమకొండ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంఈఓ రాంకిషన్‌రాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల సతీష్, రోహిత్, మోహ్సిన్, సాజిద్, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.



కాళోజీ సెంటర్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న కేంద్రం

హన్మకొండ అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతీ సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీఇచ్చి ఇప్పటివరకు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ తీరుపై నగరంలోని హంటర్ రోడ్డులోని రాజ్ హోటల్ సమీపంలో ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ రీసెర్చ్ స్కాలర్స్ ఫెల్లోషిప్‌లను కేంద్రం రద్దు చేసిందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్ రంగానికి కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు మధు, ప్రదీప్, సాయి కార్తీక్, కిరణ్, వెంకటేష్, సురేష్, రాజ్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ డీఈఓ కార్యాలయం ఎదుట..

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ల్యాదెళ్ల శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీపీ.గౌడ్, ప్రశాంత్, వినోద్, నవీన్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

చెరువులను కబ్జా నుంచి కాపాడాలి



రేణుకకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్: నగరంలోని 14వ డివిజన్‌లోని ముసలమ్మకుంట, కోట చెరువులను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎంసీపీఐ(యూ) కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి గోవర్ధన్ రాజు కోరారు. ఈమేరకు వరంగల్ నాయబ్ తహసీల్దార్ రేణుకకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసలమ్మకుంట పరిధిలో 18 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేస్తున్నారని, కోట చెరువు పరిధిలోని 39 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఎస్సీల పేరుతో కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఆ చెరువులకు హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని ఇళ్లు లేని పేదలకు నివేశన స్థలాలుగా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) కాశిబుగ్గ కమిటీ సభ్యులు అజయ్‌కుమార్, ప్రేమలత, అనూష, రేణుక, సుధీర్, హరీష, అనూష, మాధవి, శ్రీకాంత్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



మామునూరు: బీజేపీ తెలంగాణ ఎన్నికల కమిటీ నిర్వాహక చైర్మన్‌గా నియమితులైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మల్లాడి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో 13 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, కుక్టా బాధ్యులు భిక్షపతి, మధుకర్‌రావు, చీకటి శ్రీనివాస్, గజ్జల మల్లేష్, సత్య, కల్పన, స్వప్న, మంజుల, శ్రీధర్‌రావు, సౌజన్య, ప్రియాంక పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణలోని పలు యూనివర్సిటీల పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, కేయూ జనరల్ సెక్రటరీ సోల్తి కిరణ్‌గౌడ్, జనరల్ సెక్రటరీ బత్తుల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సర్వర్ అడ్మినిస్ట్రేషన్‌పై సదస్సు



మాట్లాడుతున్న అరుణ్

హసన్‌పర్తి: నగర శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఐతఈఈ విభాగం ఆధ్వర్యంలో సర్వర్ అడ్మినిస్ట్రేషన్ అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ప్రముఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ అరుణ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో డేటా స్టోరేజ్, క్లౌడ్ ప్రాముఖ్యత కంప్యూటర్ రంగంలో ఎక్కువగా ఉందని తెలిపారు. సర్వర్ అడ్మినిస్ట్రేషన్ విధివిధానాలు, మైక్రోసాఫ్ట్ అజ్యూర్, క్లౌడ్ ఆవశ్యతను పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, డాక్టర్ మహేందర్, డాక్టర్ సుదర్శన్, ఏట వేణుగోపాల స్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మూల రాము తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మతిస్థిమితం సరిగాలేని మహిళ ఆత్మహత్య

మడికొండ: మతిస్థిమితం సరిగాలేని వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాంపేట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కుల రేణుక (50) హసన్‌పర్తి మండలం భీమారం గ్రామానికి చెందిన జక్కుల కొమురయ్య, రేణుకకు 30 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఐదేళ్ల నుంచి రేణుక మతిస్థిమితం కోల్పోయి భయ భ్రాంతులకు గురవుతుండేది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతకగా వ్యవసాయ బావిలో ఆమె మృతదేహం కనబడింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింగరావు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

ఖిలా వరంగల్: మద్యానికి బానిసై మనస్థాపానికి లోనైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చింతల్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ రహిమాన్ (38) కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భర్తతో గొడవపడి అతని భార్య 15ఏళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. నాటి నుంచి మద్యానికి బానిసయ్యాడు కూలీ పనులకు వెళ్లకుండా బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిట్లోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు మహ్మద్ ఉస్మాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యువతి అదృశ్యం

వరంగల్ క్రైం: ఓ యువతి.. ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.కరుణాకర్ వివరాల ప్రకారం కంచరకుంట్ల ప్రాంతానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న యువతి.. ఇంట్లోని తల్లిదండ్రులకు చెప్పపెట్టకుండా బయటకు వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ప్రమాదంలో నలుగురికి గాయాలు

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా కోమటిపెల్లి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఖమ్మం నుంచి వరంగల్‌కు కారులో బయలుదేరారు. ఈక్రమంలో ఖమ్మం జాతీయ రహదారిపై టీఎస్ఎస్పీ బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే రోడ్డుపై నిలిచిఉన్న టిప్పర్‌ను కారుతో వెనుక భాగాన ఢీకొట్టారు. దాంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులు వైద్య పరీక్షల కోసం ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లినట్లు తెలిసింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడికొండ: కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన బండి సమ్మయ్య (55) మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి బుధవారం పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసినట్లు రాఘవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నరేందర్ రెడ్డి, నాయకులు నరోత్తం రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్ కాలనీలో..



కాశిబుగ్గ: ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బుధవారం పరామర్శించారు. కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్ కాలనీకి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులు ప్రదీప్‌రావు ఓదార్చారు. అలాగే, తిలక్ రోడ్డులో అనారోగ్యంతో మృతి చెందిన ఉమ్మగాని సదానందం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్‌ల బహూకరణ



ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న సీఐ మహేందర్

వరంగల్: ఆరెపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎన్ఆర్ఐ వంగపాటి రాజశేఖర్‌రెడ్డి రూ.1.50 లక్షల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లను ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సొసైటీ ఫర్ ఎంపవర్‌మెంట్ స్కిల్స్ గ్లోబల్లి అనే సంస్థను వరంగల్‌లో ఏర్పాటు చేసి సంస్థ ద్వారా అనేక విద్యా సంబంధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ద్వారా పేద విద్యార్థులు విద్య నేర్చుకునేందుకు పాఠశాలకు ల్యాప్‌టాప్ అందించిన రాజశేఖరరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, బుద్దె శ్రీనివాస్, సంస్థ జిల్లా కార్యదర్శి సువర్చల, ఎస్ఎంసీ చైర్మన్లు స్వరూప, మంజుల ఉపాధ్యాయులు మున్ని, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేసిన పూర్వ విద్యార్థి

రామన్నపేట: వరంగల్‌లోని ఏవీవీ పాఠశాల విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త గర్రెపల్లి వెంకటేశ్వర్లు చేయూత నిచ్చారు. ఈమేరకు రూ.5,500 విలువగల నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ప్రిన్సిపాల్ భుజేందర్, పూర్వ ప్రధానోపాధ్యాయులు వాసుదేవులు, ఉపాధ్యాయులు నవీన్, విజయలక్ష్మి, వాసంతి, భాగ్యలక్ష్మి, వీరేశలింగం, వెంకటేశ్వర్లు, రమాదేవి పాల్గొన్నారు.

కేయూ పాలనాధికారులకు సన్మానం



మనోహర్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు



కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ విభాగాల డీన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మనోహర్‌ను పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధిపతి ప్రొఫెసర్ యాదగిరి రావు, పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీనివాసరావు సన్మానించారు, అలాగే, కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ వెంకయ్య, కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్యను ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకట గోపినాథ్, డాక్టర్ కరుణాకర్‌రావు, ఆశీర్వాదం, అరూరి సూర్యం తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ సదాశివ్ బాధ్యతలు చేపట్టగా, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్, అధ్యాపకులు సన్మానించారు. బీసీ సెల్ సంచాలకుడిగా నియామకం పొందిన ఒప్పంద అధ్యాపకుడు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

మోదీ సభకు భారీగా తరలిరావాలి



ఖిలా వరంగల్: ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కుసుమ సతీష్, కొండేటి శ్రీధర్



కాజీపేట: సోమిడిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఖిలా వరంగల్: ప్రధాని నరేంద్ర మోదీ సభకు భారీగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని ఫోర్ట్‌రోడ్డుపై ప్రచార రథాలను వారు జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనతో దేశాన్ని ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిపారని వివరించారు. ఈనెల 8న హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రత్నం సతీష్, రంజిత్, రఘునారెడ్డి, హరిశంకర్, సిద్దం నరేష్, అచ్చ విద్యాసాగర్, వెంకటరమణ, రాంబాబు, సత్యనారాయణ, బైరి శ్యాం పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

కాజీపేట: పీఎం నరేంద్రమోదీ వరంగల్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ కోరారు. ఈమేరకు కాజీపేట మండలం సోమిడి గ్రామంలో నర్సింగ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడానికి ఈనెల జిల్లాకు 8న ప్రధాని వస్తున్న నేపథ్యంలో ప్రజలు భారీగా తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భగవాన్ దాస్ ఉపాధ్యాయ, మేకల శ్రావణ్ కుమార్, గిరగాని హరిప్రసాద్, సుంచు వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రిన్సిపాల్ మృదుల

కాజీపేట అర్బన్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని కేంద్రీయ విద్యాలయ వరంగల్ పాఠశాల ప్రిన్సిపాల్ మృదుల సూచించారు. కాజీపేట మండలం కడిపికొండలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో నూతనంగా ఎంపికైన స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్లు, పలు విభాగాల కెప్టెన్ల ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. స్కూల్ కెప్టెన్‌గా దీపక్ (బాలురు), వరుంజిత(బాలికలు), వైస్ కెప్టెన్లు ఎం.జగదీశ్వర్, ఆనందిత, స్పోర్ట్స్ కెప్టెన్లు తరుణ్, సహస్రతో ప్రిన్సిపాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజనగర్‌వాల్, అనభత్తుల వెంకన్న, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సఖి సెంటర్ సేవలపై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సఖి సెంటర్ సభ్యులు

దేశాయిపేట: దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళల సమస్యలు, బాలికల సమస్యలు, హక్కులు, మహిళా రక్షణ చట్టాలు, బాల బాలికల రక్షణ చట్టాలు, పోక్సో యాక్ట్, బాల్య వివాహ నిషేధిత చట్టాలపై ఆశ వర్కర్లకు వరంగల్ సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీలత బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి కేంద్రంలో బాధిత మహిళలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. బాధిత మహిళలు ఆపద సమయంలో 181, 1098, 100, 0870 – 3571832 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం సఖి సెంటర్ సేవలపై కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ భరత్ కుమార్, సూపర్‌వైజర్ జన్ను కోర్నెలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

వరంగల్ చౌరస్తా / ఖిలా వరంగల్: వరంగల్ 28వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వరంగల్‌లో కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సమక్షంలో బుధవారం చేరారు. ఈక్రమంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఎంబడి రవీందర్, కాంగ్రెస్ నాయకులు అయూబ్ జన్ను రవి, గొల్లన రవి, బాషపాక సదానందం, గజ్జల లింగమూర్తి, జన్ను వేణు, కోదాటి అనిల్, కాశీ, రాందేవ్, యాదగిరి, గిన్నారం రాజు, జన్ను ఆదాం, దినేష్, అజాముల్ ఖాన్, మహమూద్ పాషా, యాట వీర ప్రతాప్, రాజు, కుసుమ రవి, సునీత, రావుల భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో చోరీకి యత్నం

శాయంపేట: శాయంపేటలోని రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి చాంబర్‌లో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎలాంటి వస్తువులు చోరీకి గురికాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి స్టెల్లా చాంబర్‌లో ఉన్న గ్లాస్ కిటికీ ఆటోమెటిక్ లాక్ పనిచేయకపోవడంతో, ఒక పక్క గ్లాస్ డోర్, మరోపక్క మెష్ జాలివేసి లాక్ చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఏఈఓ రైతువేదిక వద్దకు విధులకు హాజరు కాగా, ఆమె చాంబర్‌లోని కిటికీ మెష్ జాలీ కట్ చేసి కనిపించింది. ప్రభుత్వం జారీ చేసిన వాల్‌పోస్టర్లు చింపిఉండడం, బీరువా తలుపులు పగలగొట్టడానికి యత్నం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. వెంటనే మండల వ్యవసాయాధికారి గంగాజమునకు సమాచారం అందించడంతో వెంటనే చేరుకుని పరిశీలించి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మందుబాబులే ఈ ఘటకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.